# ‘మాటల వేట’

యామిజాల పద్మనాభస్వామి

మాటలో కనిపించని శక్తి వుంటుంది. మంచికీ చెడ్డకీ ఆశక్తి పనిచేస్తుంది. మాటను వృధాగా ఖర్చు చెయ్యకూడదు. మన్నన కలిగించేదీ, మర్యాద తొలగించేదీ మాటే. కనుకనే ‘పలుకు ప్రమాదము’ పనికి రాదంటుంది భారతం.... మంచిచెడ్డలు ఆలోచించక నోటికి వచ్చినట్టు మాటలు అంటూ వుండడం కొందరికి పరిపాటి. అది ఒక్కొక్కపుడు చిక్కుతెచ్చి మూర్ఛ వచ్చినంతవరకు వెళ్లుతుంది. అందుకే మాటకి మాట తెగులు-నీటికి నాచుతెగులు—అనే సామెత కూడా అవతరించింది. దీనికి తోబుట్టువే ‘నోరా వీపుకి తేకే’ అనే సామెత.

అయితే మాటకారితనం పనికిరాదా! అని ఎవరేనా ప్రశ్నించవచ్చు. మాటకారితనం చాలామందికి అబ్బదు-అని దానికి జవాబు చెప్పవచ్చు. గవ్వలాడించినట్టు మాటాడడం మాటకారితనం అనిపించుకోదు. వడ్లగింజల రూపాంతరమే పేలాలు. కానీ వడ్లగుణం వేరు, పేలాల గుణం వేరు.

‘మాటకారి’ అర్థంలోనే సంస్కృతములో ‘వాచాల’ అనే పదం వున్నది. దానికి సమానమే ‘వాగ్మి’ అనేది. అదేం ప్రారబ్ధమో ‘వాచాలుడు’ అంటే ‘వాగుడుకాయ’ అనే అర్థమే స్ఫురిస్తుంది (నాకు)

‘వాగ్మి’ అంటే ఇంపుగ, సొంపుగా, నేర్పుగా మాటడేవ్యక్తి అని అర్థం.

ఎవరేనా వచ్చి ‘అబ్బాయి మీ అమ్మ మగడు ఉన్నాడా’ అని అడగడానికీ ‘మీ నాయన ఉన్నాడా’ అని అడగడానికీ తేడా ఉందంటారా లేదంటారా? .. వ్యాహారం యొక్క వ్యవహారం ఇలాగు వుంటుంది. ఇది గుర్తెరిగి వ్యవహరిస్తూ వుండాలి అని మన గ్రంథాలు చెప్తూవున్నవి.

కొందరికి మాటకారితనం జన్మసహజం అయిన ముఖాలంకారం అనే చెప్పాలి. అందుకే అన్నాడు ఒక గీర్వాణ కవి.

> ‘దాతృత్వం ప్రియవక్తృత్వం
> ధీరత్వ ముచితజ్ఞతా
> అభ్యాసేన న లభ్యంతే
> చత్వార స్సహజా గుణాః’- అని.

ఈవి ఇంపుగా మాటాడడం, ధైర్యము, ఔచిత్యము-అనే ఈ నాలుగునూ పుట్టుకతో వచ్చేవేగాని నేర్చుకుంటే వచ్చేవి కావు....

పేరంటానికి వచ్చిన ముత్తైదువకు వాయన మిస్తూ ‘ఇస్తినమ్మా వాయనం అంటే పుచ్చుకున్నానమ్మా వాయనం అంటుంది. ఇందే! అంటే అందే! అంటుంది. అందుకే అన్నారు పెద్దలు ‘తల విలువ నోరు చెప్తుంది’-అని.

ఒక చదువుకున్న వయసుమళ్లిన ఆసామి పొరుగూరుకి చేరుతూ ఊరి వెలుపల ఒక చెట్టుకింద కూర్చున్న పదేళ్ల పిల్లవాణ్ణి చూసి ఇక్కడికి మీ ఊరు ఎంతదూరం వుంటుంది? అని అడిగాడట! ఆ పిల్లవాడు అతగాడి దగ్గరకు వచ్చి ‘నన్ను చూడు నా మేకలు చూడు పడమట నున్న పొద్దుచూడు—నా ఊరు యెంత దూరమో తెలుస్తుంది’—అని అన్నాడట! ఇంచుమించు పదేళ్లవాడు, వాడు కాస్తూన్నది మేకలు. నక్కని చూస్తే నాలు గామడలు పారిపోయే పిరికిజంతువులు. పడమటన పొద్దు గుంకుతూంది. ఎంతో దూరమయితే వాడు ఇంకా అక్కడ తేన సజ్జుగా కూర్చుంటాడా?....

అలాగే. ఒక బాటసారి దారిన పోతూ ఊరుముందు పేడ పోగుచేస్తూన్న ముసలమ్మను చూసి ‘అవ్వా! ఈ ఊరు మంచిదేనా?’ అని అడిగాడట! ఆ ముసలమ్మ తడుపుకోకుండా జవాబు చెప్పింది ప్రశ్నార్థకంగా ‘నీ నోరు మంచిదేనా?’ అని. మొగం మీద మొత్తినట్టయిందా పెద్దమనిషికి.

మేకల కాపరి ఏమి పెద్దవాడని అలాటి మాటతో జవాబు చెప్పాడు.

కసవుతీసే ముసలమ్మ ఏమి చదువుకున్నదని అలాటి ప్రశ్న వేసింది.

ఇదే మాట అనేది—అంటే గడుసరితనమును కడుపులో వుంచుకుని మాటాడడం అంటే — చదువుకు మాటకారితనానికీ పొంతన వుండదు. అది పైన చెప్పినట్టు పుట్టుకతో రావాలి.

కొందరి నోట వచ్చే మాట కర్రవిరిచి పొయ్యిలో పెట్టినట్టుంటుంది. ఒకొక్కవ్యక్తి మాట ఇంకా వినాలి అని వుంటుంది. అందుకే జ్యోతిశ్శాస్త్రజ్ఞులంటారు. వాక్స్థానాన్ని బుధుడుగానీ గురువుగానీ చూడడం మంచిది-అని. బుధుడు చూస్తే చమత్కారంగా, హాస్య గర్భితంగా, యుక్తియుక్తంగా వుంటుంది. గురువు చూస్తే శాస్త్రీయంగా, సత్వ, సత్యగుణప్రధానంగా వుంటుంది....

చిన్నప్పుడు మాసంస్కృతోపాధ్యాయులు దేవులపల్లి సీతారామశాస్త్రిగారు పాఠం చెప్తూ బహు చమత్కారంగా అంటూవుండేవారు. ఒకనాడు పాఠం చదువుతున్నాను. ఒక ఎడ్ల బండి వచ్చి మా ఇంటిముందు ఆగింది. దానిలో నుంచి ఒక స్త్రీవ్యక్తి, ఒక పురుషవ్యక్తిదిగారు. మాకు కొంచెం దూరపు చుట్టాలు. ఆమె కొంచెం యెత్తుగా, కండపుష్టిగా, నిండైన విగ్రహం. మోటుగా మాటాడడం ఆమెకి సహజాలంకారం. ఆమెను చూసీ చూడడంతో మా గురువుగారు నన్ను అడిగారు. ‘కేయం సుబాహుజననీ?....అని’ సంస్కృతంలో—ఈ సుబాహుతల్లి ఎవరు?....నాలో నేను నవ్వుకున్నాను. ఈ తాటక ఎవరు? అని అర్థం.... ఇంచుమించు తాటకలాగే వుంటుంది ఆమె. ఆ మగాణ్ణిచూసి ఎవరీ గరుడాళ్వారు అని అడిగాడు నన్ను. అతడు గరుత్మంతుడిలాగే నిడుపైన చేతులూ, కాళ్ళూ, పెద్దతలకాయా వున్న వికారపు మనిషి - గురువుగారి వుద్దేశంతో గ్రద్ద-అని అర్థం. ఎక్కువగా మాటాడే వ్యక్తిని చూసి ‘ఒరే! వీడు గంటలబండిరా!’ అనేవాడు. అంటే ఏమిటర్థం—‘ఎద్దు’ అని. ఎద్దు యెలా వుంటుందో మీరే వూహించుకోండి.

ఇంతవరకు మీకు మాటలతో వచ్చేవేట సూత్రప్రాయంగా చెప్పాననుకుంటాను. ఇక ప్రధానపాత్రను ప్రవేశపెట్టి ఆయన మాటల వేట కొంత, పెద్దలవల్ల విన్నది విన్నట్టు నా భాషతో చెప్తాను.

గత శతాబ్దపు ఘనుడు ఆయన. పేరు నడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రి. బొబ్బిలికి ఉత్తరాన సుమారు ఇరవై మైళ్ల దూరాన నాగూరు అనే గ్రామం. అది ఆయన స్వస్థలం. చామనచాయ, వామనమూర్తి. కానీ చదువుకీ చమత్కారానికీ పెట్టింది పేరు. ఎదిరించి మాట విసరవలసివస్తే దేవుణ్ణి కూడా సూటిగా ఘాటుగా అని నవ్వించే మాటకారి.

స్వతంత్రుడు. పోషకులు సజావుగా ఉంటే తానూ అనుకూలుడే. వారు శాస్త్రోక్తంగా ఉన్నట్టు కనిపించగానే గావంచా పైన వేసుకుని పోషకత్వానికి తిలోదకాలిచ్చి వెళ్ళిపోయే నిండు మానిసి. పేరుకి పూర్వులు సంపాదించిన మాన్యం వ్యవసాయం చేసేవాడు. బ్రాహ్మణ వ్యవసాయం అయిపోయేది. తిండికి చాలీచాలని గింజలువచ్చేవి. ఎందుకీ బాధ! దగ్గరగా ఉంది జమీ— అని బొబ్బిలి సంస్థానంవార్ని ఆశ్రయించాడు. రాత్రి భోజనాలు అయ్యాక వెలమదొరలు చావడికి వచ్చేవారు. సర్వమంగళేశ్వర శాస్త్రిలు పురాణం చదివి చెప్పడం. దొర బాబయ్యలు ఓపికగా వారివారి కబుర్లతో తలలు ఊపుతూ ఉండేవారు కొందరు. కొందరు స్తంభాలకు చేరబడి కునుకి పాట్లు పడేవారు. ఇది కనిపెట్టి శాస్త్రులుగారు భారతం చదువుతూ భాగవతం, రామాయణం ఒకటేమిటి? ఏదో కథ చెప్తూ అల్లిబిల్లి గారడీ చేస్తూ ఉండేవారు. పురాణం కాగానే వారికి తోచింది వారు అర్ధా, పావలా పళ్ళెంలో వేస్తూ ఉండేవారు.

ఒకనాడు శాస్త్రులుగారు ఇంకా పుస్తకం విప్పలేదు. దొరగారు ఒకొక్కరే వస్తున్నారు నిదానంగా. అంతలో పెద్ద దొరగారు దయచేశారు. శాస్త్రులుగారిని చూసి "ఏమి శాస్త్రుల్లుగారూ! ఇక పురాణం ఈడుస్తారా?" అని అడిగారు నవ్వుతూ. "చిత్తం-చిత్తం. తమరు రాలేదనే చూస్తున్నాను. ఇక ఈడుస్తాను. తమరు ఏడుస్తారు" అని అన్నాడు శాస్త్రులుగారు. "మేమెందుకు ఏడుస్తామయ్యా!" అన్నారు దొరగారు. "ఇవాళ లక్ష్మణమూర్ఛ అని నిన్ననే మనవి చేశాను. అది విని ఏడుస్తారు అని అర్థం'—అని తాటాకు పొత్తం తాడు విప్పి (ఆ కాలములో తాటాకు పుస్తకాలే యెక్కువగా ఉండేవి) తాడు పట్టుకుని శాస్త్రులుగారు లేచి చావడిలో ఇటునుంచి అటూ అటునుంచి యిటూ ఈడవడం కాగా ఇంకేముంది? తాటాకులు ఎక్కడికక్కడ తునాతునకలై, పుస్తకం చిత్రవధచేసినట్టైపోయింది. పెద్ద దొరగారు అది చూసి 'ఏమయ్యా మా పుస్తకం తాతల నాటిది. నాశనం చేశావు.' అని అనగా 'ఆగ్రహం చేయకండి దొర బాబయ్యగారు. తమ సెలవు ప్రకారం చెయ్యాలని ఈడిచాను. నేనేమి చేసేది? అది లక్ష్మణుడి బాణాలకి రావణుడి సైన్యం ఛిన్నాభిన్నం అయినట్టు అర్థంచేసుకోండి. అంతే.... మరేమీకాదు. ఇదీ యధార్థ రామాయణం-' అని....స్వస్తి ప్రజాభ్యః-అని ఆనాటి పురాణ కాలక్షేపానికి స్వస్తి చెప్పాడు. ఎవరూ ఏమీ అనలేకపోయారు. పైగా నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఆ పుస్తకం దొరగారు మాత్రం లోలోపల ఏడుస్తూ వేంచేశారు....శాస్త్రులుగారి ధోరణి ఇలాటిది....

ఒకనాడు సాయంకాలం శాస్త్రులుగారు చిన్న పట్టురుమాలు భుజానవేసుకుని వీధిలో వెళ్తున్నారు. గాలికి యెగిరి ఆ రుమాలు కిందపడింది. అంతలో వెనకనుంచి గుర్రపు బగ్గీలో వస్తూన్న రాజుగారు కిందికిదిగి దానిని తీసి శాస్త్రులుగారూ! మీ రుమాలా? అని చిరునవ్వుతో అడిగారు. శాస్త్రులుగారు చూసి అయ్యో! మాదిగా ఏల ముట్టితివి! అని తాకకుండా అనగానే దానిని అలాగే విసిరివేసి రాజుగారు చిరచిరలాడుతూ వెళ్ళిపోయారు.

ఆ సంవత్సరం: తెలుగునాట సామాన్యంగా భోగిపండుగకు అల్లుడు వెళ్ళడం పరిపాటిగా ఉన్నా కారణాంతరంవల్ల దీపావళి పండుగకు శాస్త్రులుగారు అక్కతో సహా అత్తవారింటికి వెళ్ళవలసి వచ్చింది. ఆనాడు ఉదయం నీళ్ళపోతలు అయ్యాక శాస్త్రులుగారి అక్క నట్టింట పంచలో కూర్చుని వరాహ కుంచితో దుద్దులు శుభ్రం చేసుకుంటూంది. అంతలో శాస్త్రులుగారి వదిన (భార్య అక్క) అలాగువచ్చి చూసి 'వదినా! కుంచెలు ఎంత బాగున్నాయి! ఊరపందివా? అడవిపందివా?' అని అడిగింది. శాస్త్రులుగారు ఆ సమయములో తులసికోట దగ్గర నిల్చుని సూర్య నమస్కారాలు చేస్తూ వదినగారి మాటవిని ఊరకున్నావేమి అక్కయ్యా! జవాబు చెప్పవమ్మా! అని ప్రోత్సహించాడు. వెంటనే అక్క అన్నాది జవాబుగా. 'వదినా! ఊర పందివో అడవి పందివో కాని మొత్తం మీద పందివే'-అని....ఆ జవాబుకి వదిన కిమ్మనకండా మొగం పక్కకి తిప్పుకుని వెళ్ళిపోయింది. ఆ శాస్త్రుల్లుకి అక్క ఆమె.


*With the best compliments from :*

THEEBY JEWELLERS

STAR BAZAAR, RANGANATHAN STREET

**T. Nagar - Madras-600 017**

**PHONE : 446278**

మర్యాదకి ఊరకుందిగాని మాగరాకకాదు. మరొక గడియ పోయాక వదినగారు అక్క దగ్గరకు వచ్చి 'వదినా! మీ తమ్ముడికి ఏ కూర యెక్కువ యిష్టం?' అని అడిగింది. "ఏ కూరయినా తింటాడుగాని కందే యెక్కువ యిష్టం" అని చెప్పింది అక్క.

వంటా వడ్డనా అయింది. వదిన వడ్డిస్తూంది. శాస్త్రులుగారు చూస్తూ కుర్చున్నారు. "ఏమిటిలా చూస్తున్నారు మరిదిగారు. ఆ కందకా" అని హేళనగా అన్నారామె. "ఆ కందకే" అన్నారు శాస్త్రులుగారు వెంటనే. కావాలని అరటాకు నిలువుగా వేసి ఆకు చివరన వేసింది కందకూర. ఈయన వామనావతారుడు. కందకూర అందలేదు చూస్తూ కూర్చున్నాడు. అదీ కథ—తాను జయించినట్టు వదినగారు నవ్వి ఇంతకూర తెచ్చి ముందుగా వేసి యిక తినండి పాపం....అని అన్నది. ఆయన నవ్వుతూ 'యిది తినేదంతా మీ పుణ్యమే' అని అనగా అందరూ నవ్వుకున్నారు.

చారు వడ్డన అయింది. ఎలా వుంది చారు అని అడిగిందామె. 'చారు చారుతరం భాతి హింగూజీరక మిశ్రితం। తిల్కాదానం ముఖమివ కించిల్లవణ వర్జితం'—

ఇంగువ, జీలకర్ర వగైరా అన్నీ కలిపి చారు చాలా గొప్పగా ఉందేకాని బొట్టులేని మొగంలాగా కొంచెం ఉప్పు తక్కువయింది, అని అన్నాడు. ఆ వదినగారు పని తొందరలో బొట్టు పెట్టుకోడం మరిచిపోయింది. అది చూసి శాస్త్రిల్లు ఒక చురక అంటించారు. చప్పున ఆమె లోనికివెళ్ళి బొట్టు పెట్టుకుని చారులో ఉప్పు కలిపి మళ్ళీ వచ్చి వడ్డించింది భోజనాలు అయాయి. పగలంతా బావమరదుల పరియాచకాలతో, ఆటలతో, పాటలతో అయింది.

రాత్రి భోజనాల దగ్గర—తాటాకు కొంప. నూనె దీపాల వెలుగు. వడ్డన జరుగుతూంది. మిల్లి గరిటతో వదినగారు నేయి వడ్డించింది. శాస్త్రిల్లుగారు చప్పున వ్రేళ్ళు ముడిచి 'పడ్డాది పడ్డాధి' అన్నాడు గట్టిగా. ఆదుర్దాగా వదిన దీపం తెచ్చి ఏమిటి పడ్డాది ఏదీ పిడికిలి విప్పండి అన్నాది. మెల్లగా విప్పాడు. ఆమె నిదానించి చూసి 'ఏమీ పడలేదే. మీదినుంచి ఏమేనా పడ్డాదేమో అనుకున్నాను - అని అన్నాది. ఏమీ పడలేదు మీదినుంచి అనే అలాగన్నాను అన్నాడు. ఆమె గ్రహించి బలే మరిదిగారు అని నవ్వి మరో రెండు గరిటలు నేయి వడ్డించింది. భోజనాలు అయాయి.

మర్నాడు మధ్యాహ్నం బయలుదేరే ముందు అత్తవారి రైతువచ్చి శాస్త్రుల్లుబాబూ! నక్క కుడివేపునుంచి వెళితే మంచిదా, ఎడంవేపునుంచి వెళ్తే మంచిదా? అని ధర్మసందేహంగా అడిగాడు. కరవకుండా ఎటు వైపునుంచి వెళ్ళినా మంచిదే అని టపీమని చెప్పారు శాస్త్రుల్లుబాబు. ఆ సమాధానానికి అక్కడ వున్నవారందరూ విరగబడి నవ్వారు.

ఇంటికి వచ్చిన తరువాత ఒకనాడు ఆలోచించాడు. ఈ బొబ్బిలి సంస్థానముకన్ననూ పెద్దది విజయనగరం. అక్కడికి పోతే కులాసాగా కాలక్షేపం చెయ్యవచ్చు అని అనుకుని విజయనగరం చేరాడు. మహారాజా దర్శనం అయింది. రాజుగారు 'శాస్త్రుల్లుగారూ! మీ పేరేమిటి?' అని అడిగారు. 'సర్వమంగళేశ్వరశాస్త్రి' అని అంటారన్నాడీయన. 'మీ యింటి పేరు?' 'మా యింటిపేరు నడిమింటివారు' అని శాస్త్రుల్లు చెప్పగా 'ఇంట నడిమివారా?' అని రాజుగారు చిరునవ్వుతో అన్నారు. 'ఏం పూసపాటి చెయ్యదా?' అని శాస్త్రుల్లు అనేసరికి రాజుగారి చిరునవ్వు అంతరించుకుపోయింది. ఈ సంభాషణతోనే బెడిసికొట్టింది. అయినా రాజుగారు గంభీరుడు, సరసుడు కనుక నమ్మి వచ్చిన శాస్త్రులుగారిని కొంతకాలం ఆస్థాన విద్వాంసుడుగా ఉంచుకున్నాడు. సహజమైన ఛలోక్తులతో రాజుగారినీ సభ్యులనూ అలరిస్తూ ఉన్నాడు ఆ శాస్త్రుల్లు. ఆ సంవత్సరం సూర్యగ్రహణం వచ్చింది. రాజుగారు విద్వాంసుల్ని రప్పించి పితృదేవతల ప్రీతిగా ఏవో దానాలు ఇస్తూ సర్వమంగళేశ్వర శాస్త్రుల్లు దగ్గరకు రాగా ఒక పొట్లం అందించబోయారు. 'ఏమిటా పొట్లం' అన్నారు శాస్త్రుల్లు. 'మీకు తిలదానం' అన్నారు రాజావారు. 'అబ్బే! అలా కాదు. తిల దానం తెలకలివాడికి. ఫలదానం నాకు!' అని శాస్త్రుల్లు అనగా 'మేము ఏమిస్తే అది మీరు తీసుకోవాలి' అన్నారు రాజుగారు. 'మీరేమిచ్చినా తీసుకోడానికి గడ్డి కరిచే గాడిదను కాను.

*Diwali Greetings from :*


**Krishna Conductors Private Limited**

(Manufacturers of : AAC & ACSR Conductors)

*Regd. Office :*
ANJANEYA PANTULU ST.,
**LABBIPET, VIJAYAWADA-520010**
Phone : 74934

*Works :*
**TADEPALLI-522501**
GUNTUR Dt, A. P.
Phone : 82340

***Branch at :*** **5, VIDYODAYA, 1st CROSS, T. NAGAR, MADRAS-600 017**
Phone : 443910



శాస్త్రం చదివిన సర్వమంగళుణ్ణి.' అని గట్టిగా అన్నాడు శాస్త్రుల్లు. 'అయితే మీకు దేవిడీ మన్నా' అన్నారు రాజుగారు. 'ఆమాట నువ్వనే దేమిటి? నేనే ఇస్తున్నాను. సముద్రానికి ఏతం ఎత్తినవాడ్ని నేను.' అని గిర్రున వెను దిరిగి వచ్చి తిరిగి బొబ్బిలిలో కాలు పెట్టాడు.

రాజుగారు భోజనం చేసేవేళ. లోపలికి రమ్మన్నారు. వెళ్ళాడీయన. నమస్కారాలూ, పలకరింపులూ అయాక ఒక వెండి పళ్ళెంలో పళ్ళుముక్కలు పెట్టించి, 'శాస్త్రుల్లుగారూ కానీ యండి' అన్నారు రాజుగారు. కానీ లేక ఇలా వచ్చాను అన్నాడు శాస్త్రుల్లుగారు. రాజుగారు నవ్వి 'ఆరగించవయ్యా, ఎప్పుడూ ఒక్క లాగే వుంది ధోరణి' అని అన్నారు.

రాజుగారు భోజనం ముగించి చివర ఒక పిడచ క్రిందికి నెట్టి శాస్త్రుల్లుగారూ! విజయ నగరం రాజు ఇంత అన్నం భోంచేస్తాడా? అని అడిగారు. 'మీరు తిన్నది ఆయన కుక్కకి పారవేసినంత వుంటుంది అన్నారు శాస్త్రుల్లుగారు అదురూ బెదురూ లేకుండా.... రాజుగారు చిటపటలాడుతూ లెండి లెండి అని లేచి రేపు తెల్లవారేసరికి దయచెయ్యండి అని లోపలికి వెళ్ళిపోయాడు.

మర్నాడు తెల్లవారింది. నడిమింటి శాస్త్రుల్లు కోటలోకి వెళ్లి రాజుగారికి కబురు పంపాడు తాను వచ్చినట్టు. రాజుగారు వచ్చి పలకరించి ముందుకు నడుస్తూ వెంట రమ్మన్నారు. శాస్త్రుల్లు వెళ్ళాడు. వెళ్లి వెళ్లి మరుపదొడ్డి దగ్గర రాజుగారు నిల్చుని ద్వారాని పైన వ్రేలాడగట్టిన విజయనగర మహారాజ చిత్ర పటం చూపి 'శాస్త్రుల్లుగారూ! చూశారా మీ రింతకాలం వున్న మీ రాజాగారు ఎక్కడ వున్నారో!' అని నవ్వుతూ అన్నారు.

వెంటనే శాస్త్రుల్లు జవాబు యిచ్చాడు.

"ఔను. పొద్దుటే ఆయన మొగం చూస్తే మీకు విరోచనం అవుతుంది. ఇంటికీ ఒంటికీ మంచి ఆలోచించే ఈపనిచేశారు. బాగుంది."

ఆ జవాబు విని రాజావారు వెంటనే ఆ చిత్రపటం అక్కణ్ణించి తీయించివేశారట.

ఈలాటి మాటల వేటకాడు శ్రీ జగన్నాథ స్వామి దర్శనానికి వెళ్ళాడు. ఆ క్షేత్రములో పూజారులుగౌడులు. మత్స్యమాంస భుక్కులు. తెలిసే అక్కడికి వెళ్లారు. ధ్యానం అయింది. అలవాటు ప్రకారం స్వయంపాకం చేసుకుని మర్రాకు విస్తరి వడ్డించుకుని భోజనంచేశాడు శాస్త్రులుపేరు అప్పటికే నలుగురి నోటా నాను తూంది. పెద్దపూజారి కాస్త చదువుకున్న వాడు. శాస్త్రుల్లుని పలకరించడానికి వచ్చి మర్రాకును చూసి "శాస్త్రులుగారూ! అన్నీ తెలిసిన పెద్దలు. మీరీ పని చెయ్యవచ్చునా? మా అవతారం పడుకునే ఆకు ఎంగిలిచేశారే" అదోకలాగు మొగంపెట్టి అడిగాడు. శాస్త్రుల్లు తక్కువతిన్నాడా మాటలలో? "మీ అవ తారం పడుకునే ఆకు నేను ఎంగిలిచెయ్యడం అలా ఉండనీయండి. మీరు అవతారాన్నే తినే స్తున్నారే" అని ఎదురుదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బతో మొగం వాచి పూజారి గింజుకుంటూ వెళ్ళిపోయాడు.

సాయంకాలం స్వామిని దర్శించాడు. ఇంతలో బ్రాహ్మణేతరులు కావడితో తెచ్చిన ప్రసాదం శ్రీ జగన్నాథస్వామికి నివేదిం చడంచూశాడు. పూజారి ఇచ్చిన ఆ ప్రసాదం నిరాకరించి 'మడీ తడీ లేకుండా యెవరో తేవడం, అది నివేదించడం, దాన్ని ప్రసాద ముగా నేను తీసుకోడమా? నీకు ఆచారం అక్కరలేదా స్వామీ!' అని వెన్నుదిరిగి వచ్చాడు.

రాత్రి బసలో ఏమిటో మసక మసకగా కనిపించసాగింది. ఏమిటో అర్థం కాలేదు. పడుకున్నాడు. తెల్లవారింది. లేచాడు. కళ్ళు విడలేదు. ఎవరో వచ్చి పిలిచారు. "ఇలా రావయ్యా! కళ్ళు విడలేదు" అన్నాడు. ఆ వ్యక్తి సహాయముతో ప్రభాత కాలకృత్యాలు తీర్చుకుని ఆలయంలోకి వెళ్ళి స్వామిని ఎనిమిది శ్లోకాలు చెప్పి ప్రార్థించాడు. కళ్ళు విడ్డాయి కాని ఒకటే పని చేస్తూంది.' సరే కానీ! ఆనాడు కాకాసురుడిదగ్గర ఒక కన్ను తీసుకున్నావు. ఈనాడు నాదగ్గర ఒక కన్ను తీసుకున్నావు. ఆ రెండు కళ్ళతో మాబోటి వాళ్ళను చల్లగా చూస్తూ కాపాడుతూ ఉండు. ఈ ఒక్క కంటితో నేను కాలక్షేపం చెయ్య లేకపోను స్వామీ! సెలవు ఇప్పించు. వెళ్ళి వస్తాను" అని తీర్థయాత్ర ముగించుకుని ఇంటికి వచ్చాడు. దేవునితో కూడా చమ త్కార ధోరణిలోనే నాలుక నడిపిన వ్యక్తి సర్వమంగళేశ్వరశాస్త్రి.

సంస్కృతములో ఈయన 'సమాస కుసుమావళి' అనే చిన్న లక్షణఖండిక వ్రాశాడు. అమరసింహుని అమరకోశం ఎంత ఆవశ్యకమో సంస్కృతాభ్యాసులకు ఇది అంత ఆవశ్యకం. దీని ప్రారంభ శ్లోకము విఘ్నేశ్వర స్తుతి. అది ఎంత చమత్కారంగా ఉందో అవధరించండి.

"భూనాయకం వా ధననాయకం వా
భజన్ భువం వా ధనమేతి లోకే
తద్విఘ్ననాథం న భజామి హింస
సహస్రశస్తం ప్రణమీమి నిత్యం"-

భూమి ఉన్నవాణ్ణిగాని, ధనం ఉన్నవాణ్ణిగానీ సేవిస్తూ భూమినిగానీ ధనమునుగానీ వారివల్ల పొందడం లోకములో పరిపాటి. విఘ్న నాథుణ్ణి సేవిస్తే విఘ్నాలే వస్తాయి కాబట్టి నేను అతణ్ణి సేవించను. నా పనిలో ప్రవే శించకు విఘ్ననాథా! అని నిత్యమూ వెయ్యి మ్రొక్కులు మ్రొక్కుతూ ఉంటాను—ఇదీ ఈ శ్లోకానికి భావం. చూశారా నడిమింటవారి మాటల వేట యెలా ఉంటుందో! ఈ మాటల వేట బాణాల వేటకన్న నిశితమైనది. అందరికీ పట్టుపడేది కాదు. అందుకే నేర్పరిఅయిన విలుకాని ఉజ్జ్వలశరం లక్ష్యానికి తగిలితే తగులుతుంది. తప్పినా తప్పుతుంది. కాని మాటకారి మాట మాత్రం తప్పక తగులు తుంది అని అన్నది భారతం.... ★